



నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 5 అక్టోబర్ 2024 | HYDERABAD


## 6 నుంచి పార్కింగ్ ఫీజు

### భగ్గుమంటున్న మెట్రో ప్రయాణికులు



సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): మెట్రో రైలు ప్రయాణికుల డిమాండ్లను పరిష్కరించకుండా పార్కింగ్ ఫీజులు పెంచుతామంటున్న ఎల్ అండ్ టీ మెట్రో అధికారులపై ప్రయాణికులు భగ్గుమంటున్నారు. గత నెలలోనే నాగోల్,మియాపూర్ మెట్రో స్టేషన్లలో కొత్తగా పార్కింగ్ ఫీజులు పెంచుతామని బోర్డులు ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో అధికారులు వెనక్కి తగ్గారు. మళ్లీ తాజాగా మెట్రో ప్రయాణికులకు 3 ఆఫర్లు అంటూ ప్రకటిస్తూనే... నామమాత్రపు పార్కింగ్ ఫీజును అక్టోబర్ 6 నుంచి వసూలు చేయాలని నిర్ణయించడం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 3 బోగీలతో నడుస్తున్న మెట్రో రైళ్లకు అదనంగా కోచ్‌లను ఏర్పాటు చేయాలని నెలల తరబడిగా డిమాండు చేస్తున్నా.. ఆవిషయాన్ని పట్టించుకోకుండా పార్కింగ్ ఫీజులు పెంచుతారా.? అంటూ సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్నారు.

## పేరు మార్చారు..
# పట్టాలెక్కిస్తున్నారు!

### ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టుకు హెచ్‌సిటీ కలరింగ్
### స్వల్ప మార్పులతో 'కేబీఆర్' వద్ద ట్రాఫిక్ ఫ్రీ ప్రణాళిక
### రూ.826 కోట్లతో 6 కూడళ్లలో రెండు దశల్లో పనులు

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : కొత్త సీసాలో పాత సారా అన్నట్లు ఎస్ఆర్‌డీపీ పథకాన్ని హెచ్‌సిటీగా మార్చిన రేవంత్ సర్కారు...గ్రేటర్‌లో ముఖ్య కూడళ్లను సిగ్నల్ ఫ్రీగా మార్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రణాళికలను అమలు చేయక తప్పని పరిస్థితి. కేసీఆర్ ముద్రను లేకుండా చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి..పథకాల పేర్లను మాత్రమే మార్చి.. నాటి ప్రణాళికల్లో స్వల్ప మార్పులు చేసి ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాలను చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, గ్రేడ్ సపరేటర్లు కట్టాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. టెండర్ ప్రక్రియను ముగించి పనులు ప్రారంభించే లోపు కొందరు పర్యావరణవేత్తలు ఆందోళన చేసి.. జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో ఈ ప్రాజెక్టులు ముందడుగు పడలేదు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలోని ఆనంద్ విహార్ దగ్గర సొరంగ మార్గం తరహాలో కేబీఆర్ పార్కు చుట్టూ భూగర్భ సొరంగ మార్గంలోనూ అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని భావించినా.. దక్కన్‌పీఠ భూమి ఐనా గ్రేటర్‌లో భారీ వ్యయం, అందులో కేబీఆర్ పార్కు కావడంతో సాధ్యాసాధ్యాలపై లోతైన అధ్యయనం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేవంత్‌రెడ్డి కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఆరు కూడళ్లలో ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించారు. దీంతో బీఆర్ఎస్ ప్రతిపాదనల్లో స్వల్ప మార్పులు చేసి.. అండర్ పాస్‌లను తెరపైకి తీసుకొచ్చారు. పార్కు చుట్టూ ఉన్న ఆరు జంక్షన్లను రూ. 826 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించి పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు జంక్షన్లను హెచ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడంతో పాటు డిజైన్లను సైతం రూపొందించారు. రెండు దశల్లో టెండర్లు పిలిచి ఆరు జంక్షన్ల పనులు చేపట్టేందుకు బల్దియా సిద్ధమవుతున్నది.



## రేవంత్‌కు మంచి బుద్ధి ప్రసాదించు బాబా

సీఎం రేవంత్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని, మూసీ పరీవాహక ప్రాంతంలోని తమ ఇండ్ల జోలికి రాకుండా చూడాలంటూ ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురి శ్రీ వెంకటసాయినగర్, ఫణిగిరి కాలనీవాసులు స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.. బాబాకు వినతిపత్రం సమర్పించారు. -ఎల్బీనగర్

## ఓయూకు ఏమైంది?

### పరీక్షలు ఒకటవ తేదీ నుంచి...
### నోటిఫికేషన్‌పై సంతకమైంది 26న
### వెబ్‌సైట్‌లో ఉంచింది మాత్రం 3న...
### అధికారుల వైఖరితో దిగజారుతున్న వర్సిటీ ప్రతిష్ట



పరీక్షకు ఐదు రోజుల ముందు తేదీలను నిర్ణయిస్తూ అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 4: శతాధిక వసంతాల ఉస్మానియా యూనివర్సిటీ పరువును దిగజార్చేలా అధికారులు ప్రవర్తిస్తున్నారు. నాలుగేండ్లుగా అధికారుల వైఖరిపై ఎన్నోసార్లు వివిధ ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ, వారిలో మాత్రం కొద్దిగా కూడా మార్పురాలేదు. తాజాగా, వర్సిటీ అధికారుల మరో లీల వెలుగుచూసింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వర్సిటీ పరువు దిగజారడంతో పాటు విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించింది. సాధారణంగా ఏదైనా పరీక్షలు నిర్వహించే తేదీని పదిహేను రోజుల ముందే ప్రకటించి, సదరు నోటిఫికేషన్‌ను వెబ్‌సైట్‌లో ఉంచాల్సినప్పటికీ అధికారులు దానిని మరిచారు. దీంతో పరీక్షలు రాయాల్సిన విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమైన సంగతి కూడా తెలియలేదు. ఎంకామ్ మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ (2022-2023 బ్యాచ్ మాత్రమే) పరీక్షలను ఈ నెల 1న నిర్వహించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు గత నెల 26న నోటిఫికేషన్ విడుదల చేశారు. పరీక్షలు నిర్వహించబోయే తేదీకి కేవలం అయిదు రోజుల ముందుగా పరీక్షా తేదీలను నిర్ణయించిన ఘనత ఓయూ అధికారులకే దక్కింది. పరీక్షలు మొదలైన రెండు రోజుల తరువాత పరీక్షా తేదీలతో కూడిన నోటిఫికేషన్‌ను వెబ్‌సైట్‌లో ఉంచారు.



EXAMINATION TIME TABLES


| Time Tables | Date |
|---|---|
| PG (M.Com) I-Semester (CBCS-Old Scheme - 2022-2023) Backlog & Improvement Examinations, October-2024 | 03-10-2024 |
| M.Sc (Chemistry) Five Years Integrated Course I,III , V & VII-Semester (CBCS - Backlog & Improvement) Examinations, Oct/Nov-2024 | 01-10-2024 |
| MA (Oriental Languages - CBCS) II & IV-Sem (Regular) and I,II & III Semester(Backlog) Examinations, October-2024 | 01-10-2024 |

పరీక్షలు ప్రారంభమైన అనంతరం రెండు రోజుల తర్వాత వెబ్‌సైట్‌లో ఉంచిన అధికారులు

# అప్రకటిత భారం

## అనుమతి లేకుండానే ఆస్తి పన్ను పెంపు

- ఆదాయం పెంచుకునేందుకు అడ్డదారులు
- స్టాండింగ్ కమిటీ తీర్మానం, ప్రభుత్వ అనుమతి లేకుండానే భారం
- ఆదాయం తగ్గుతున్న నేపథ్యంలో రూ.50 కోట్ల అదనపు రాబడికి అడుగులు
- కౌన్సిల్‌లో నిలదీస్తామంటున్న కార్పొరేటర్లు




సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో బల్దియా యంత్రాంగం అడ్డదార్లు తొక్కుతున్నది. నిబంధనలను నీళ్లొదిలి ప్రజలపై పన్ను భారం మోపుతున్నది. బల్దియాకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్నును ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండానే సవరణలు చేస్తున్నది. ఇందుకు విద్యుత్‌శాఖ బిల్లులు, సబ్ రిజిస్ట్రార్లను పావుగా వాడుకుంటున్నది. గత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో పోల్చితే పన్ను వసూలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో అడ్డదార్లు తొక్కైనా సరే.. ఆదాయాన్ని పెంచుకునే దిశగా పావులు కదిపి అమలు చేస్తున్నది. నూతనంగా కొనుగోలు చేస్తున్న ఖాళీ స్థలం నుంచి ఇండ్లు, అపార్ట్ మెంట్‌లోని ఫ్లాట్ వరకు రిజిస్ట్రేషన్ చేస్తూనే ఆస్తిపన్ను సైతం అసెస్‌మెంట్ చేస్తున్నారు. రిజిస్ట్రార్ అంతేకాదు స్టాండింగ్ కమిటీ నుంచి ఎటువంటి తీర్మానం, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే ఆస్తిపన్నును పెంచేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే బల్దియా అప్రకటిత ఆస్తిపెంపు నిర్ణయాన్ని అమలు చేస్తున్నదని ప్రజలు మండిపడుతున్నారు. అప్పుల ఊబి నుంచి జీహెచ్ఎంసీని బయటపడేసేందుకు తమపై భారం మోపుతారా అంటూ.. ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### 19.49 లక్షల ప్రాపర్టీలు

జీహెచ్ఎంసీ పరిధిలో 19.49 లక్షల ప్రాపర్టీలు ఉండగా, వీటిలో రెసిడెన్షియల్ 16.35 లక్షలు, నాన్ రెసిడెన్షియల్ 2.80 లక్షలు, మిక్స్డ్ 34వేల వరకు ఉన్నాయి. వీటి నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు దాదాపు రూ.1224 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేశారు. ఈ ఏడాది రూ. 2,400 కోట్లు వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. టార్గెట్ చేరుకోవడానికి ప్రస్తుతం రూ.101 ఆస్తిపన్ను చెల్లిస్తున్న భవనాలకు రేట్లను సవరించి పెంచాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. పెంచిన పన్నునే వసూలు చేస్తున్నారు. దీంతో పాటు ఇప్పటి వరకు పన్ను నెట్ వర్క్ లేని వాటిని గుర్తించడానికి డ్రోన్ సర్వే చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు చందానగర్, మియాపూర్, ఇతర ప్రాంతాల్లో 14వేల ప్రాపర్టీలను సర్వే చేశారు. వీటితోపాటు బిల్డింగ్ పర్మిషన్, ఆక్యూపెన్సీ, తాజాగా ఆస్తిపన్ను చెల్లించిన రశీదు, వాటర్ బిల్లు, కరెంట్ బిల్లు, ట్రేడ్ లైసెన్స్, ఓనర్ వివరాలు సేకరిస్తున్నారు. వాటర్ బిల్లు, కరెంట్ బిల్లు ఆధారంగా రెసిడెన్షియల్ కేటగిరీలో పన్ను చెల్లిస్తున్నారా? కమర్షియల్ కేటగిరీలో చెల్లిస్తున్నారా? అనే అంశాన్ని పరిశీలించి పన్ను పెంచుతున్నారు. ముఖ్యంగా నివాస కేటగిరీలో పన్ను చెల్లిస్తున్న 50వేల నిర్మాణాలకు వాణిజ్య కోటా విద్యుత్ సరఫరా అవుతున్నట్లు తేలింది.

### రూ.50 కోట్ల మేర ఆదాయం..

చదరపు అడుగుకు 60 పైసలు, 80 పైసల చొప్పున పన్ను చెల్లించే కట్టడాలకు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సుమోటోగా నోటీసులు జారీని ప్రారంభించారు. నాలుగు కేటగిరీల్లోని రెండు లక్షల నిర్మాణాలను సర్వే చేస్తే..మొత్తంగా రూ. 50కోట్ల మేర ఆదాయం పెరగవచ్చని అధికారుల అంచనా వేశారు. అయితే ఆస్తిపన్ను పెంచాలంటే జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో తీర్మానం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా ఉత్తర్వులు ఇవ్వాల్సిందేనని ఓ అధికారి తెలిపారు. కానీ ఈ రెండు ప్రక్రియలు పూర్తి చేయకుండానే ఆస్తిపన్ను ఎలా పెంచుతారని పలువురు కార్పొరేటర్లు, రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ అప్రకటిత ఆస్తిపన్ను నిర్ణయాన్ని వచ్చే కౌన్సిల్‌లో నిలదీస్తామని కార్పొరేటర్లు హెచ్చరిస్తున్నారు.

## నేడు కందుకూరులో
# బీఆర్ఎస్ ధర్నా

### పూర్తి స్థాయి రుణ మాఫీ అమలు కోసం..
### సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలో పోరాటం
### హాజరుకానున్న మాజీ మంత్రి కేటీఆర్



కందుకూరు, అక్టోబర్ 4 : అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో రుణ మాఫీ అమలు చేయాలంటూ.. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలో కందుకూరు మండల కేంద్రంలో శనివారం భారీ ధర్నా చేయనున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమల్లో విఫలమవ్వడం.. రుణమాఫీని పూర్తి స్థాయిలోఅర్హులైన రైతులకు వర్తింపజేయకపోవడాన్ని నిరసిస్తూ చేపట్టే ఈ ధర్నాలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు నేతలు పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. ధర్నా ఏర్పాట్లపై పార్టీ నాయకులతో చర్చించారు. అధికారం కోసం అడ్డగోలు హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండా పబ్బంగడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి.. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేసే వరకు వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

## ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

సిటీబ్యూరో: రిజిస్టర్‌లో సంతకాలు పెడుతూ..విధులకు డుమ్మాలు కొడుతున్న ఇద్దరు ఉపాధ్యాయులపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. బండ్లగూడ-2 మండలం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయులు వి. పీక్‌లాల్, పి. వెంకట్‌రెడ్డిను సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చూపిస్తే శాఖపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

## 12న ఉప్పల్ స్టేడియంలో టీ-20 మ్యాచ్

సిటీబ్యూరో: ఉప్పల్ స్టేడియంలో ఈ నెల 12న ఇండియా, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగే టీ 20 క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో స్థానిక డీసీపీలు, ఏసీపీలతో పాటు జీహెచ్ఎంసీ, అగ్నిమాపక శాఖ, ఎలక్ట్రిసిటీ విభాగాలు, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి బందోబస్తుపై సమీక్ష నిర్వహించారు.

## గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలి

### బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : నగరాన్ని గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రేటర్‌లో శానిటేషన్ ప్రక్రియను మెరుగుపరిచి గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని శానిటేషన్ అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు. గతంలో శానిటేషన్ మెరుగుకు తీసుకున్న చర్యలు, ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. అవసరమైతే జోనల్ కమిషనర్లు, ఎస్ఎస్‌డబ్ల్యూ ఇంజినీర్లతో చర్చించి తుది నివేదికను రెండు రోజుల్లో అందజేయాలని శానిటేషన్ ఏసీకి సూచించారు.

## మామూళ్ల మత్తులో ఆబ్కారీ

### యథేచ్ఛగా నగరానికి కల్తీ కల్లు



సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): ఆబ్కారీ శాఖ మామూళ్ల మత్తులో జోగుతున్నది. గ్రేటర్‌లో యథేచ్ఛగా కల్తీ కల్లు విక్రయాలు కొనసాగుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారుల నిర్లక్ష్యం.. అవినీతి కారణంగా నగరంలోని కల్లు కంపౌండ్‌లకు నకిలీ కల్లు సరఫరా అవుతున్నట్లు సమాచారం. 2007లో నగర శివార్లతో పాటు ఇతర జిల్లాల్లో కల్తీ కల్లు సేవించి సుమారు 8వేల మంది అస్వస్థతకు గురవ్వగా, అందులో 12 మంది మృత్యువాతపడ్డారు. ఆ తరువాత 2012లో మరోసారి రంగారెడ్డి జిల్లా పరిధిలో కల్తీకల్లుతో పలువురు అస్వస్థతకు గురైన ఉదంతాలు వెలుగుచూశాయి.

### పెద్ద ఎత్తున సరఫరా

కల్తీ కల్లు తయారు చేయడంతో పాటు నగరానికి సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి నాలుగు డ్రమ్ముల కల్తీ కల్లు, 2కిలోల అమోనియం బైకార్బొనేట్ పౌడర్, సిట్రిక్ యాసిడ్ సంచి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం... కడ్తాల్‌లోని పలు ప్రాంతాల్లో జోరుగా కల్తీకల్లు తయారవ్వడంతో పాటు పెద్ద ఎత్తున నగరానికి సరఫరా అవుతున్నట్లు సమాచారం అందుకున్న కడ్తాల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ తన సిబ్బందితో కలిసి ఈనెల 3న ఠాణా పరిధిలో పలు చోట్ల దాడులు నిర్వహించారు. పాలకుర్తి రాఘవేందర్ ఇంటివద్ద పెద్ద ఎత్తున కల్తీ కల్లు తయారీ కేంద్రం బయటపడింది. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.




వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేశ్ కుమార్

## స్థలంపై కన్నేసి..
# నకిలీ పత్రాలు సృష్టించి..

### మహిళతో పాటు ఐదుగురి అరెస్టు

జీడిమెట్ల, అక్టోబర్ 4 : ఖాళీ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసిన ఓ మహిళతో పాటు మరో ఐదుగురిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీసీపీ సురేశ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఉప్పుగూడలో నివాసముండే సురేశ్‌కు వెంకటాద్రినగర్ సర్వే నంబర్ 33/8 , 33/11 లో కోటి రూపాయలు విలువ చేసే 200 గజాల స్థలం ఉంది. ఈ స్థలంపై కన్నేసిన సుభాష్‌నగర్‌కు చెందిన ప్రధాన నిందితురాలు వరుసకు సోదరి అయిన ఓ మహిళ పేరిట నకిలీ పత్రాలను సృష్టించింది. ఇందుకు గగనం నరేంద్ర అలియాస్ నందు, రవి శంకర్, హరీశ్, రేపాక కరుణాకర్ అనే వ్యక్తుల సహకారం తీసుకుంది. వారితో కలిసి నకిలీ పాన్ కార్డులను తయారు చేయించి.. ఆధార్ కార్డులలో పేర్లను మార్పులు చేయించారు. సదరు కార్డులను ఉపయోగించి ప్రధాన నిందితురాలు స్థల యజమాని మృతి చెందినట్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులను బురిడీ కొట్టించింది. అధికారులు సమగ్రంగా విచారించకుండనే నిందితురాలి సోదరి పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. సదరు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి లోపల చిన్న పాటి డబ్బాను ఏర్పాటు చేయించారు. ఇటీవల సురేశ్ తన స్థలాన్ని చూసేందుకు వెంకటాద్రినగర్‌కు వచ్చాడు. తన స్థలంలో గోడ నిర్మాణం చూసి కంగుతిన్నాడు. ఈ విషయమై స్థానికుల వద్ద ఆరా తీయగా, ఓ మహిళ కబ్జా చేసినట్లు తెలుసుకున్నాడు. ఆమెను నిలదీయగా, తన వద్ద పక్కాగా పేపర్లు ఉన్నాయని, 'నీకు ఈ స్థలానికి ఎటువంటి సంబంధం లేదం'టూ..బెదిరింపులకు పాల్పడింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టి.. నిందితులను అరెస్టు చేశారు.

# ప్రాణం తీసిన ఈత సరదా

### చెరువులో మునిగి ముగ్గురు చిన్నారుల మృతి
### చేపల కోసం కొందరు గాలం వేయగా..
### బయటపడిన ఓ బాలుడి మృతదేహం
### గాలింపులో మిగతా ఇద్దరి మృతదేహాలు సైతం లభ్యం
### మేడ్చల్ జిల్లా కొల్తూర్‌లో ఘటన



మనోజ్, హర్షవర్ధన్, మణిహర్ష

శామీర్‌పేట: ఈత సరదా ముగ్గురు చిన్నారుల ప్రాణాలు తీసింది. సరదాగా అడుకునేందుకు వెళ్లి.. చెరువులో దిగి..ఈత రాక మునిగిపోయారు. అయితే కొందరు చెరువులో చేపల కోసం గాలం వేయగా, ఓ బాలుడి మృతదేహం బయటపడింది. పరిసరాల్లో మిగతా ఇద్దరి మృతదేహాలను గుర్తించి వెలికి తీశారు. ఈ విషాద ఘటన మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం కొల్తూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు కథనం ప్రకారం..కొల్తూర్ గ్రామానికి చెందిన బాలేకర్ బాలేశ్ కుమారుడు మణిహర్ష(12) 7వ తరగతి, సలేంద్రి కనకరాజు, లావణ్య దంపతుల కుమారుడు హర్షవర్ధన్(10) 6వ తరగతి, వీరబోయిన శోభ, స్వామి దంపతుల కుమారుడు మనోజ్ (11) 6వ తరగతి చదువుతున్నారు. వేర్వేరు స్కూళ్లలో చదువుతున్న వీరంతా గ్రామంలోని యాదవ కాలనీలో నివాసముంటున్నారు. పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో శుక్రవారం ఉదయం సరదాగా ఆడుకునేందుకు ముగ్గురు కలిసి గ్రామ పెద్ద చెరువు వద్దకు వెళ్లారు. ఒడ్డున కొద్దిసేపు ఆడుకున్న అనంతరం చెరువులోకి దిగారు. ఈత రాక మునిగిపోయారు. చెరువు పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం ఎలా జరిగిందో తెలియలేదు.

### గ్రామంలో విషాద ఛాయలు

విద్యార్థులు నీటి మునిగిపోయిన కొద్ది సేపటికి గ్రామానికి చెందిన కొందరు చేపలు పట్టడానికి చెరువు వద్దకు వెళ్లారు. గాలం వేసినప్పుడు నీటి మునిగిన ఓ బాలుడి దుస్తులకు గాలం చిక్కుకుంది. గాలానికి చేప పడింది అనుకుని బలంగా లాగగా.. బాలుడి మృతదేహం బయట పడింది. అదే చోట మరో చిన్నారి మృతదేహం లభించింది. ఈ విషయం గ్రామంలోనికి దావానంలా వ్యాపించడంతో ముగ్గురు కలిసి ఆడుకోవడానికి చెరువు వద్దకు వచ్చినట్టు తేలింది. మూడో చిన్నారి కూడా ఇదే చెరువులో పడి మృతి చెంది ఉంటాడని గాలించగా, అతడి మృతదేహం కూడా లభించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు చిన్నారుల మృతితో కొల్తూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.